సాక్షి
ఆదిలాబాద్

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



మాండలికపు పరిమళాలు

'ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం' వైవిధ్య కార్యక్రమాల మేళవింపుతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటోంది. మాండలికపు పరిమళాల తో ప్రత్యేకతను చాటుతోంది. 8లో▸



ఘనంగా వెంకన్న కల్యాణం

తలమడుగులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఇందులో భాగంగా చివరిరోజు స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.0/13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరగనుంది. రాత్రివేళలో చలితీవ్రత. వేకువజామున పొగమంచు ప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

బోథ్‌లో ఫైర్‌స్టేషన్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన

- ఎమ్మెల్యే బాపూరావ్ అడిగిన ప్రశ్నకు మంత్రుల సమాధానం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాపూరావ్

బోథ్: బోథ్‌లో ఫైర్‌స్టేషన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడానికి ప్రతిపాదన ఉందా అని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ ఆదివారం అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు సంబంధిత మంత్రులు మహమ్మద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి సమాధానం ఇచ్చారు. బోథ్‌లో ఫైర్‌స్టేషన్ ఏర్పాటును పరిశీలిస్తున్నామని హోంమంత్రి తెలిపారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 262 స్థలంలో ఏర్పాటును పరిశీలిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ప్రారంభం



కుట్టు పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: వృత్తి విద్య సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 వరకు కొనసాగనున్నాయి. జిల్లా కేంద్రంలోని నాలుగు కేంద్రాల్లో టైలరింగ్, చిత్రలేఖనం, లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు 446మంది అభ్యర్థులకు గాను 186 మంది మాత్రమే హాజరయ్యారు. 260 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈవో టి.ప్రణీత పర్యవేక్షించారు. కాగా, పరీక్షలకు హాజరైన అభ్యర్థులే కుట్టు మిషన్లు తీసుకెళ్లి పరీక్ష కేంద్రంలో కుట్లు, అల్లికలతో ఆకట్టుకున్నారు.

22న బోథ్‌కు మంత్రి హరీశ్‌రావు రాక

బోథ్: ఈనెల 22న బోథ్ మండల కేంద్రానికి రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావ్, ఇంద్రకరణ్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే బాపూరావు తెలిపారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

డీటీఎఫ్ నుంచి ఇద్దరు తొలగింపు

ఆదిలాబాద్‌టౌన్: డీటీఎఫ్ గాదిగూడ మండల బాధ్యులుగా వ్యవహరిస్తున్న కత్తి సంతోష్, రంజిత్‌ను సంఘం నుంచి తొలగిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, వృకోదర్ ప్రకటనలో తెలిపారు. సంఘ నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందునే వారి సభ్యత్వం రద్దు చేసినట్లుగా పేర్కొన్నారు.

నేడు సీపీఐ ధర్నా

ఎదులాపురం: కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నేడు ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట ఉదయం 11 గంటలకు ధర్నా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కప్పర్ల గ్రామంలో నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మళ్లీ.. బోదకాలు!

- ఆరేళ్ల తర్వాత కేసులు
- చాపకింద నీరులా ఫైలేరియా
- ఇటీవల నిర్వహించిన సర్వేలో బహిర్గతం

సర్వే చేసిన పీహెచ్‌సీలు	10
సేకరించిన నమూనాలు	3వేలు
పాజిటివ్ నిర్ధారణ కేసులు	27

జిల్లాలో ప్రస్తుతం బోదకాలు బాధితులు
1,583

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఫైలేరియా(బోదకాలు) దడ పుట్టిస్తోంది. చాపకింద నీరులా ఈ వ్యాధి విస్తరిస్తుండటంతో బాధితుల సంఖ్య క్రమేణా పెరుగుతుంది. ఇటీవల జిల్లాలో వారం పాటు బోదకాలు వ్యాధి నిర్ధారణ కోసం పలుచోట్ల సర్వే చేపట్టారు. ఇందులో భాగంగా రక్తనమూనాలు సేకరించారు. 1100 శాంపిల్స్‌ను పరీక్షించగా 27మందికి పాజిటివ్‌గా తేలింది. మరో 2వేల మంది నమూనాలను పరీక్షించాల్సి ఉండటంతో బాధితుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు వైద్య ఆరోగ్య శాఖాధికారులు చెబుతున్నారు. దోమకాటు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందడంతో బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లుగా అభిప్రాయపడుతున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుకు నివేదించడంతో పాటు వ్యాధి కట్టడికి అనుసరించాల్సిన కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. 2016లో నిర్వహించాల్సిన సర్వేలో ఒక్కరికి కూడా పాజిటివ్ రాకపోగా ఆరేళ్ల తర్వాత నిర్వహించిన సర్వేలో బాధితుల సంఖ్య పెరగడం గమనార్హం.

చాపకింద నీరులా విస్తరణ

ఫైలేరియా వ్యాధి జిల్లాలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. క్యూలెక్స్ దోమ వ్యాధిగ్రస్తులను కుట్టి, మరొకరిని కుట్టినట్లైతే వారికి కూడా వ్యాధి సోకుతుంది. అయితే రాత్రిపూట దోమకాటుతో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 1,583 మంది వ్యాధి బారినపడి అంగవైకల్యంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. శరీరంలో ఫైలేరియా ప్రవేశించిన నాలుగు, ఐదేళ్ల తర్వాత దాని లక్షణాలు బయటపడి కాలు బోదకాలుగా మారుతోంది. నడువడానికి ఇబ్బంది తప్పదు. ఒక్కసారి దీని బారిన పడితే జీవితాంతం బాధపడాల్సిందే. వ్యాధి తీవ్రత తగ్గించేందుకు చర్యలు చేపట్టవచ్చు కానీ, వ్యాధిని మాత్రం శరీరం నుంచి బయటకు తొలగించే పరిస్థితి ఉండదని వైద్యులు చెబుతున్నారు. దీని బారిన పడకుండా ఉండాలంటే ప్రభుత్వం ముందుగా మాస్‌డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా మాత్రలను పంపిణీ చేస్తుంది. వందలో ముగ్గురికి వ్యాధి సోకి ఉంటే ఆ ప్రాంతాన్ని ప్రభావిత ప్రాంతంగా గుర్తించి, అక్కడి ప్రజలందరికీ ఏడాదికోసారి డైఇథైల్ కార్బొజోమిన్, ఐవర్‌మెట్టిన్, అల్బెండోజోల్ మాత్రలను అందజేస్తారు. బాధితులకు 12 రోజుల పాటు ఈ మాత్రల ద్వారా చికిత్స అందిస్తారు. అయితే 2016లో వ్యాధి తీవ్రత లేకపోవడంతో అప్పటి నుంచి వీటిని పంపిణీ చేయలేదు. ఈక్రమంలోనే వ్యాధి తీవ్రత పెరిగినట్లుగా తెలుస్తోంది.

దడ పుట్టిస్తున్న కేసులు

ఫైలేరియా వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఇటీవల వారం పాటు సర్వే చేపట్టారు. రాత్రి 8 నుంచి 12 గంటల వరకు ఈ వ్యాధిని వ్యాప్తి చేసే దోమలు కుట్టే అవకాశముండటంతో ఆ సమయంలోనే సర్వే చేపట్టారు. దోమ లార్వాలను గుర్తించేందుకు గతంలో వ్యాధిగ్రస్తులున్న పీహెచ్‌సీల పరిధిలో మైక్రో ఫైలేరియా సర్వే చేపట్టారు. జిల్లాలోని అంకోలి పీహెచ్‌సీ పరిధిలో భీంసరి, శాంతినగర్ పీహెచ్‌సీలో ఇందిరమ్మకాలనీ, సోనాల పీహెచ్‌సీలో ధనోరా-బి, బేల పీహెచ్‌సీలో బేల, సైద్‌పూర్ పీహెచ్‌సీలో చెప్రాల, దంతన్‌పల్లి పీహెచ్‌సీలో పెర్కగుట్ట, నేరడిగొండ పీహెచ్‌సీలో కుమారీ, బజార్‌హత్నూర్‌లో పిప్రీ, జైనథ్ పీహెచ్‌సీలో జైనథ్, తాంసి పీహెచ్‌సీలో కప్పర్ల గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఒక్కో గ్రామంలో 300 మంది నుంచి నమూనాలు సేకరించారు. ఇలా 10 పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 3వేల శాంపుల్స్ సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 1100 పరీక్షల్లో 27మందికి పాజిటివ్‌గా తేలడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులన్నీ ఆయా ప్రభావిత ప్రాంతాల్లోనే నమోదు కావడం గమనార్హం. వంద నమూనాల్లో ముగ్గురికి వస్తే ప్రభావిత ప్రాంతంగా గుర్తిస్తారు. మొత్తం నమూనాలను పరిశీలిస్తే వందకు పైగా కేసులు నమోదయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నమూనాలను మరోసారి పరీక్షల కోసం హైదరాబాద్‌లోని సెంట్రల్ మలేరియా ల్యాబ్‌కు పంపించనున్నారు. జిల్లాను త్వరలోనే ఫైలేరియా ప్రభావిత జిల్లాగా ప్రకటించి దాని నివారణకు అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లుగా తెలుస్తోంది.

వ్యాధి నివారణకు చర్యలు



జిల్లాలో ఇటీవల వారం పాటు పది పీహెచ్‌సీల పరిధిలో మైక్రోఫైలేరియా సర్వే నిర్వహించాం. ప్రభావిత ప్రాంతాల్లోని 3వేల మంది నుంచి నమూనాలు సేకరించాం. ఇందులో 1,100 నమూనాల్లోనే 27 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. వీటిని మరోసారి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి వ్యాధి కట్టడికి తగు చర్యలు చేపడుతాం. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదమున్నందున ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

– ఎం.శ్రీధర్, జిల్లా మలేరియా అధికారి

'ఉపాధి'.. తగ్గుతోంది



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- ఖరారైన 2023–24 ఉపాధి హామీ ప్రణాళిక
- బడ్జెట్‌లోనూ కోత విధించిన కేంద్రం
- గతేడాదితో పోల్చితే తగ్గిన పనిదినాలు
- త్వరితగతిన పూర్తిచేస్తే కూలీలు ఖాళీగా ఉండాల్సిందే!

జిల్లాలోని గ్రామ పంచాయతీలు	468
మొత్తం జాబ్‌కార్డులు	1,71,548
నమోదు చేసుకున్న ఉపాధి కూలీలు	3,61,062
పనులకు హాజరయ్యే కూలీలు	2,25,577
2022–23 సంవత్సర పనిదినాలు	59,86,901
2023–24 సంవత్సర పనిదినాలు	49,76,673

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే గతేడాదితో పోలిస్తే ఈ సారి పనిదినాల్లో కోత విధించింది. తాజాగా ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లోనూ ఉపాధి హామీకి నిధులు తగ్గించడం కూలీలను కలవర పాటుకు గురిచేస్తోంది. ఈ పథకం కింద చేపట్టాల్సిన పనులను సైతం పరిమితం చేయడం, వందశాతం పూర్తయితేనే కొత్త పనులకు అనుమతినిచ్చేలా ప్రణాళిక ఉండటంతో కూలీలకు వంద రోజుల పని హామనివ్వలేకపోతోంది.

గ్రామ సభల్లో పనుల గుర్తింపు

రానున్న ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులపై గతేడాది నవంబర్ నుంచి డిసెంబర్ 26వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ ప్రణాళికను ఖరారు చేశారు. కందకాల తవ్వకం, వ్యవసాయ భూముల అభివృద్ధి, హరితహారం, రాళ్లకట్టలు, మట్టి కట్టలు, చెరువుల్లో పూడికతీత, కాలువల తవ్వకాల పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామాల వారీగా చేపట్టాల్సిన పనులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో ఈ పథకానికి సంబంధించి నిధుల కేటాయింపులను తగ్గించింది. దీంతో కూలీల పనిదినాలపై భారీగా కోత విధించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎంచుకున్న పని పూర్తయితే ఖాళీగా ఉండాల్సిందే..

గ్రామానికి 20 చొప్పున పనులను కేటాయించారు. వీటికి కూలీలు ఎక్కువగా హాజరై వాటిని పూర్తి చేసినట్లైతే మరో పని చేసే అవకాశం ప్రస్తుతం లేదు. దీంతో కూలీలు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. గతంలో ఎక్కువ మంది కూలీలు హాజరైతే 15శాతం పనిదినాలను పెంచుకునే వెసులుబాటు ఉండేది. ప్రస్తుతం పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య, వారికి పనుల కేటాయింపు, వారికి చెల్లింపులు అన్ని ఆన్‌లైన్‌లోనే నిర్వహించాల్సి వస్తోంది. దీంతో కూలీల డిమాండ్‌కు అనుగుణంగా పనులు కల్పించలేని పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుతం రోజువారీ కూలి రూ.257గా నిర్ణయించారు. నిర్ణీత కొలతల ప్రకారంగా పని పూర్తిచేస్తేనే ఈ కూలి చెల్లిస్తారు. కానీ కొలతల ప్రకారంగా పనులు జరుగకపోవడంతో కూలీలకు రూ.200కు మించి చేతికందని పరిస్థితి ఉంది.

పది లక్షల పనిదినాల్లో కోత

2022–23 సంవత్సరానికి గాను 59,86,901 పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందులో ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు 30.67లక్షల పనిదినాలను మాత్రమే కల్పించారు. అంటే మరో 20లక్షల పని దినాలను కల్పించాల్సి ఉంది. అయితే జాబ్‌కార్డులు, పనులకు హాజరయ్యే కూలీలకు పొంతన లేకపోవడంతో వంద శాతం లక్ష్యం నేరవేరని పరిస్థితి ఉంది. రెండు నెలల్లో 20 లక్షల పనిదినాల కల్పన అసాధ్యంగానే కన్పిస్తుంది. అయితే కూలీలకు రూ.59.72 కోట్లను చెల్లించారు. అలాగే మెటీరియల్ కాంపొనెంట్ కింద మరో రూ.22.01 కోట్లను చెల్లించారు. తాజాగా 2023–24 సంవత్సరానికి చేసిన ప్రణాళికను చూస్తే గతేడాదితో పోలిస్తే 10,10,228 పనిదినాల్లో కోత విధించారు. దీంతో ఉపాధి కూలీలకు వంద రోజుల పని అందడం ప్రశ్నార్థకమనే భావన వ్యక్తమవుతుంది.

ప్రతి కూలీకి పని కల్పిస్తాం



పని దినాలు తగ్గించినట్లుగా మాకు ఇప్పటివరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. ఒక వేళ తగ్గినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. జిల్లాలో కూలీల సంఖ్యకనుగుణంగానే యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశాం. పనులకు హాజరయ్యే ప్రతి కూలీకి వంద రోజుల పాటు పని కల్పిస్తాం. ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదు. గతేడాది వార్షిక ప్రణాళిక లక్ష్యాలను చేరేదిశగా శ్రద్ధ వహిస్తున్నాం. కూలీలు ఆందోళనకు గురికాకుండా తమకు కేటాయించిన పనులను పూర్తిచేసేదిశగా దృష్టి సారించాలి.

– ఎస్.కిషన్, డీఆర్డీవో

హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్

ఆదిలాబాద్: పోరాడి సాధించుకున్న తెలంగాణలోనూ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 46వ వార్డు, ద్వారక నగర్ కాలనీల్లో ఆదివారం నిర్వహించిన బీజేపీ శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్ కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ ఎన్నికలవగానే సీఎం పీఠమెక్కి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న నియోజకవర్గాన్ని పట్టించుకోవడంలేదని ఆరోపించారు. జిల్లాకేంద్రంలో ఇరుకు రహదారులతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నాల నగేష్, ఆదినాథ్, దినేశ్ మాటోలియా, జోగు రవి, వేణుగోపాల్, లాలా మున్నా, విజయ్ బోయర్, మయూర్ చంద్ర, మహేందర్ ,ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాయల్ శంకర్

'బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం'

జైనథ్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాలు మోసపోయాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి అన్నారు. మండలంలోని గిమ్మ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించిన తెలంగాణ కేసీఆర్ కుటుంబం పాలైందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇందుకోసం ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్, నాయకులు సుభాష్, మయూర్ చంద్ర, కరుణాకర్‌రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గణిత ఒలింపియాడ్‌కు స్పందన

కైలాస్‌నగర్: జిల్లా గణిత మేధావి సర్దార్ ధర్మేంద్ర సింగ్ జయంతి పురస్కరించుకుని కాల్సా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తొలిసారిగా గణిత, సైన్స్ ఒలింపియాడ్ నిర్వహించారు. పట్టణంలోని ధర్మా విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన పరీక్షకు 28 పాఠశాలలకు చెందిన 323 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలుత ధర్మేంద్రసింగ్ కుటుంబీకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన పరీక్షను ప్రభుత్వ ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రతాప్, అరుణ్ పర్యవేక్షించారు. ధర్మేంద్రసింగ్ ఆశయాలను కొనసాగించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మేంద్రసింగ్ కుటుంబ సభ్యులు సోహన్ సింగ్, పూర్వ విద్యార్థులు ప్రశాంత్, గంగాసాగర్, శ్రీనివాస్‌గౌడ్, రవి, శివరాజ్, నాగజ్యోతి, రవళి తదితరులు పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఏజెన్సీ ఆస్పత్రులకు 'ఎన్‌క్వాస్'

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది పీహెచ్‌సీలకు గుర్తింపు
- త్వరలో అంకోలికి సైతం దక్కే అవకాశం
- మూడేళ్ల పాటు ప్రత్యేక నిధులు



ఎన్‌క్వాస్ గుర్తింపు పొందిన ఇంద్రవెల్లి పీహెచ్‌సీ

ఉట్నూర్: ఏటా జాతీయ వైద్యఆరోగ్యశాఖ ఇచ్చే ఎన్‌క్వాస్ గుర్తింపునకు ఉమ్మడి జిల్లా ఏజెన్సీ ప్రాంత పరిధిలోని ఎనిమిది పీహెచ్‌సీలు ఇప్పటికేఎంపికయ్యాయి. తాజాగా ఈనెల 3, 4 తేదీల్లో జాతీయ వైద్య ఆరోగ్యశాఖ బృందం అంకోలి పీహెచ్‌సీని కూడా పరిశీలించింది. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలపై సంబంధిత బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో త్వరలో ఈ పీహెచ్‌సీకి కూడా 'ఎన్‌క్వాస్' దక్కే అవకాశం ఉంది. గుర్తింపు పొందిన పీహెచ్‌సీలకు మూడేళ్లపాటు ఏటా రూ.3లక్షల చొప్పున ప్రత్యేక నిధులు అందుతాయి. దీంతో ఆయా ఆరోగ్య కేంద్రాలు మరింత అభివృద్ధి సాధిస్తాయి.

ఎన్‌క్వాస్ అంటే...

ఎన్‌క్వాస్ అంటే.. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్(జాతీయస్థాయిప్రమాణాలతో కూడిన వైద్యసేవలు). ఇది కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తుంది. ఎన్‌క్వాస్ నుంచి నలుగురు సభ్యులతో కూడిన బృందం పీహెచ్‌సీలను పరిశీలిస్తుంది. ఇందులో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు,వైద్యులు,సిబ్బంది పనితీరుతోపాటు 110 రకాల సేవలు, సౌకర్యాలు, వసతులను పరిశీలించి మార్కులు అందజేస్తుంది. ఈ నివేదికల ఆధారంగా ఆయా పీహెచ్‌సీలకు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఎన్‌క్వాస్ గుర్తింపు ఇస్తుంది.

ఇప్పటికే ఎనిమిది...త్వరలో అంకోలి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 31 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి ద్వారా గిరిజనులకు నిత్యం వైద్య సేవలు అందిస్తోంది. వైద్యాధికారులు, సిబ్బంది ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించడం, వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తారు.వీటి పనితీరు, సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించిన ఎన్‌క్వాస్ బృందం ఇప్పటికే ఎనిమిది పీహెచ్‌సీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో వాటికి గుర్తింపు లభించింది. ఇందులో బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, భీంపూర్–టీ, గాదిగూడ, సిర్పూర్(యూ), రోపంల్లి పీహెచ్‌సీలు ఉన్నాయి. తాజాగా అంకోలి పీహెచ్‌సీని కూడా ఎన్‌క్వాస్ బృందం పరిశీలించింది. త్వరలోనే దీనికి కూడా గుర్తింపు దక్కే అవకాశం ఉంది.

మూడేళ్లు.. రూ.9 లక్షలు..

ఎన్‌క్వాస్ అర్హత సాధించిన పీహెచ్‌సీలకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మూడెళ్ల పాటు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మంజూరు చేస్తుంది. ఈ నిధుల్లో 25 శాతం పీహెచ్‌సీ సిబ్బందికి బోనస్ లభిస్తుంది. మిగతా నిధులు పీహెచ్‌సీకి కావాల్సిన మౌలిక వసతుల కల్పన, మందుల కొనుగోలు తదితర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

మెరుగైన సేవలతోనే..

ఏజెన్సీ పరిధిలోని పీహెచ్‌సీల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. అలాగే ఐటీడీఏ ద్వారా పూర్తిస్థాయిలో వసతులు కల్పించడం వల్ల ఏజెన్సీ పరిధిలోని ఎనిమిది పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు దక్కింది. ఇందుకు గాను ఆయా పీహెచ్‌సీలకు మూడెళ్ల పాటు ప్రత్యేక నిధులు మంజూరు కానున్నాయి. త్వరలో అంకోలి పీహెచ్‌సీకి కూడా అర్హత లభించే అవకాశం ఉంది.

– సాధన, ఎన్‌క్వాస్ జిల్లా నోడల్ అధికారి

టీఫైబర్ సేవలు అందేదెప్పుడో..!

- మూడేళ్లుగా సా..గుతున్న ప్రక్రియ
- సోలార్ పలకల ఏర్పాటుతోనే సరి



ఆదిలాబాద్ రూరల్ మండలం లోకారి పంచాయతీ భవనంపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం టీఫైబర్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చి తర్వాత ప్రతీ ఇంటికి విస్తరింపజేయాలని ప్రభుత్వ ఆలోచన. ఈ క్రమంలో ఇంటర్‌నెట్ సేవలకు విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు గాను సోలార్ విద్యుత్‌ను కూడా సమకూర్చాలని నిర్ణయించారు. అయితే మూడేళ్లవుతున్నా జిల్లాలో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

ఇంటింటికీ డిజిటల్ సేవలే లక్ష్యంగా...

టీఫైబర్ పథకంలో భాగంగా జిల్లాలోని 300కు పైగా పంచాయతీలను కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేసే ప్రక్రియను 2020లో ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి అమృత్, రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాల్లో భాగంగా ఇంటింటికి తాగునీటి సరఫరా, ఇంటర్నెట్ అనుసంధానం కోసం గ్రామాల్లో రోడ్లకిరువైపులా పైపులైన్లు వేశారు. విద్యుత్ కోసం గ్రామ పంచాయతీల భవనాలపై సోలార్ పలకలను ఏర్పాటు చేశారు. అయితే చాలా చోట్ల పైపులైన్ పనులు అస్తవ్యస్తంగా సాగగా, ఇంటర్నెట్ కేబుల్ అనుసంధానం సైతం పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

మూడేళ్లుగా పనులు

తొలుత గ్రామ పంచాయతీలకు ఇంటర్‌నెట్ అందించి, తద్వారా దాని పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, గ్రామంలోని ఇళ్లకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే మూడేళ్లవుతున్నా ప్రక్రియ ఇప్పటికీ పూర్తికాకపోవడం గమనార్హం. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, పంచాయతీ అధికారుల అవగాహన లేమితో పనులు నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ సైతం ఇష్టారాజ్యంగా పనులు చేపడుతుండటంతో ప్రక్రియలో జాప్యం అవుతున్నట్లు సమాచారం. జిల్లాలో 300కు పైగా పంచాయతీలను ఎంపిక చేయగా ఇప్పటికీ సగం జీపీల్లో పనులు పూర్తికాలేదు. కేవలం సోలార్‌ప్లేట్స్ మాత్రమే ఏర్పాటయ్యాయి.

అవగాహన లేని పంచాయతీ అధికారులు

మనకు తెలియకుండా మన ఇంటి వద్ద ఏదైనా కార్యక్రమం జరుగుతుందా అంటే ఎవరైనా జరగదనే చెబుతారు. కానీ జిల్లాలో పంచాయతీ శాఖ అధికారులు, ఉద్యోగులకు మాత్రం గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న పనుల వివరాలు తెలియకపోవడం గమనార్హం. సోలార్ ప్లేట్స్‌ను ఎవరు, ఎక్కడ, ఎందుకు ఏర్పాటు చేశారనే వివరాలు జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఆ శాఖ ఉద్యోగులు, కార్యదర్శులకు తెలియకపోవడం వారి పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా నిలుస్తోంది. వారి బాధ్యతారాహిత్యాన్ని సైతం చాటుతోంది.

క్లుప్తంగా

బాలుడిపై పంది దాడి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో బాలుడిపై పంది దాడిచేసి గాయపరిచిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆరేళ్ల బాలుడు మహమ్మద్ అజీమ్ ఆడుకుంటుండగా అక్కడే ఉన్న పంది ఒక్కసారిగా మీదపడి దాడిచేసింది. ఆపేందుకు వెళ్లిన వ్యక్తులపై సైతం దాడికి పాల్పడింది. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వాహనం ఢీకొని దంపతులకు గాయాలు


చికిత్స పొందుతున్న కిషన్

భైంసాటౌన్: ముధోల్ మండలంలోని తరోడ వద్ద బైక్‌పై వెళ్తున్న దంపతులను వెనుక వైపు నుంచి వచ్చిన టాటా ట్రాలీ వాహనం ఢీకొనడంతో భర్తకు తీవ్ర గాయాలు కాగా, భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. వారి కథనం ప్రకారం.. సారంగపూర్ మండలం చించోలికి చెందిన కిషన్, గంగాబాయిలు ఆదివారం బాసరలో శుభకార్యానికి హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా, తరోడ వద్ద వెనుక వైపు నుంచి టాటా ట్రాలీ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో కిషన్ కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు కాగా, భార్య గంగాబాయికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్‌లో భైంసా ఏరియాస్పత్రికి తరలించగా, వారు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రాణం తీసిన అప్పుల బాధ

సారంగపూర్: అప్పుల బాధ ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన సారంగపూర్ మండలంలోని బోరిగాం గ్రా మంలో ఆదివారం వెలుగుచూసింది. బంధువుల వివరాల ప్రకారం... రుద్రాక్ష చంద్రశేఖర్ (40) పెద్ద కుమారుడికి మానసిక ఎదుగుదల లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం చేయించాడు. అప్పులు భారంగా మారడంతో పాటు కుమారుడికి ఆరోగ్యం నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బయటకు వెళ్తానని భార్యతో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం పంట పొలాలకు వెళ్లే రైతులకు స్వర్ణ కాలువ పక్కనే చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో అతడి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య కవితతో పాటు ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు


క్రేన్‌తో కారును తొలగిస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: అతివేగంగా డివైడర్‌పైకి కారు దూసుకెళ్లిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. స్థానిక కలెక్టర్‌చౌక్ సుందరీకరణ పనుల్లో భాగంగా వృత్తాకారంలో డివైడర్‌ను నిర్మించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి అర్ధరాత్రి 2 గంటల సమయంలో అతివేగంగా కారు నడుపుతూ డివైడర్‌పై ఎక్కించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదసమయంలో ఎయిర్‌బెలూన్స్ తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం క్రేన్ సాయంతో కారును అక్కడి నుంచి తొలగించారు.



మాండలికపు పరిమళాలు

ఒకప్పుడు దేశంలో, ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా కొన్ని రోజులకు గాని తెలిసేది కాదు. కానీ శాస్త్రీయ పరిశోధనలు ఎన్నో ఆవిష్కరణల ఆవిర్భావానికి నాంది పలికాయి. ఎన్నో విభిన్న సమాచార సాధనాలను పరిచయం చేశాయి. అర క్షణంలో సమాచారం మనమున్న చోటికి వచ్చి చేరింది. ఈ సమాచార విప్లవంలో రేడియోది ప్రత్యేక స్థానం. సమాచారం, వినోదం, సంగీతం ఇలా ఒకటేమిటి ఎన్నో అంశాలను ఒడిసిపట్టి శ్రోతలకు వీనుల విందు చేసింది. ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు, నిర్ణయాత్మక ఘటనలకు వేదికగా నిలిచింది. రేడియోకు ధీటుగా ఎన్ని ప్రసార సాధనాలు వచ్చినా తన రూపు, తీరు మార్చుకుంటూ... కాలం కరిగిపోతున్నా... తరాలు మారిపోతున్నా... తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో వినిపిస్తూనే ఉంది. వైవిధ్యంతో తన ఉనికిని చాటుకుంటోంది. 'ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం' వైవిధ్య కార్యక్రమాల మేళవింపుతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటూ 'రేడియో'ను పునరుత్తేజితం చేస్తోంది. ఏళ్లుగా తన ఆదరణను నిలుపుకుంటూ వస్తున్న రేడియోపై 'ప్రపంచ రేడియో దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం. – ఆదిలాబాద్

- వన్నె తగ్గని రేడియో ప్రసారాలు
- ఎఫ్‌ఎం సౌకర్యంతో అందరికీ అందుబాటులో
- కొంగొత్త ప్రయోగాలతో మున్ముందుకు...
- యాస, సంస్కృతికి పట్టం
- త్వరలోనే ఉమ్మడి జిల్లాలో ఆకాశవాణి సేవలు
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

1986 నుంచి నిర్విరామంగా...

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో ఆకాశవాణి కేంద్రం 1986 అక్టోబర్ 12న ప్రారంభమైంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వెంకటరామిరెడ్డి ఈ భవనానికి శంకుస్థాపన చేయగా, అప్పటి కేంద్ర రేడియో సమాచారశాఖ డిప్యూటీ మంత్రి ఆరీఫ్ మహ్మద్‌ఖాన్ ప్రసారాలు ప్రారంభించారు. ఈ కేంద్రం దేశంలోనే మూడోది కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి కేంద్రం కావడం విశేషం. 2015 ఆగస్టు 15వ తేదీన నాణ్యతతో కూడిన ఎఫ్‌ఎం ప్రసారాలను ఆరంభించింది. 'హలో ఆదిలాబాద్.. 100.2 ఎఫ్‌ఎం.. మనసు నిండా' అంటూ ప్రస్తుతం మూడు కిలోవాట్ల సామర్థ్యంతో 100.2 ఫ్రీక్వెన్సీ ద్వారా ప్రసారాలను అందిస్తోంది. ఈ ఫ్రీక్వెన్సీతో జిల్లా కేంద్రం నుంచి సుమారు 30–40 కిలో మీటర్ల పరిధిలో శ్రోతలు ఎఫ్‌ఎం ప్రసారాలను వినవచ్చు. త్వరలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 100.2 ఎఫ్‌ఎం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

వినూత్న కార్యక్రమాల వీచిక..

ఆదిలాబాద్ ఆకాశవాణిలో వినూత్న కార్యక్రమాలను ప్రసారం చేస్తూ శ్రోతలను అలరిస్తున్నారు. తెలంగాణ మాండలికంలో స్థానికత ఉట్టిపడేలా ఈ కార్యక్రమాల పరంపర సాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 11 గంటల వరకు 17 గంటల పాటు 100.2 ఎఫ్‌ఎం..అలా సాగుతూనే ఉంటుంది.

ఆధ్యాత్మికతకు పెద్దపీట...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో పండుగలు, జాతరలు వైభవంగా నిర్వహిస్తారు. అందులోనూ గిరిజన సంస్కృతి, సంప్రదాయ సంబంధమైన జాతర్లలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. నాగోబా మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. జాతర మహోత్సవం శ్రోతల కళ్లముందే కదలాడేలా సజీవంగా గోచరించేలా అద్భుతమైన వ్యాఖ్యానంతో ఈ అంశాలను తీర్చిదిద్దుతారు.

సాగుబడికి సాయంగా....



ఆకాశవాణి కేంద్రం ద్వారా వ్యవసాయదారులకు అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు ప్రసారం చేస్తూ వారికి ఎల్లవేళలా కిసాన్ వాణి, ఇల్లు ఎవుసం కార్యక్రమాలలో భాగంగా విత్తనాలు విత్తుకోవడం నుంచి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, పంట కోత, పంట నిల్వ, మార్కెటింగ్ వంటి వివరాలను సైతం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం నిపుణులు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో విలువైన, సలహాలు సూచనలు నిత్యం అందజేస్తున్నారు. – రైతు అంతరంగం

స్థానిక కళలకు పునరుజ్జీవం



స్థానిక భాష, యాసకు పెద్ద పీటవేసి ఆకాశవాణి హండ్రెడ్ పాయింట్ టు ఎఫ్‌ఎంలో అంతర్ధానమయ్యే దశలో ఉన్న గ్రామీణ, గిరిజన కలలు కళాకారులను ప్రోత్సహిస్తూ వారిచే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వాటికి జీవం పోస్తుంది. పల్లె పదాలు, గిరిపదం కార్యక్రమాలలో భాగంగా రేల పాటలు, చేల పాటలు, దంచుడు, ఇసిరే, పెళ్లి, ప్రేమ, భజన, గిరిజన దేవతల , గోండి, కొలామి, లంబాడీ పాటలను కళాకారులతో పాడిస్తున్నారు. –మన పురాణాలు

యువజనులకు యువ వాణి..



పాతకాలం వారి కార్యక్రమాలే రేడియోలో ప్రసారం అవుతాయనే సంప్రదాయానికి గండి కొడుతూ యువతను ఆకర్షించే విధంగా యువ వాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వివిధ కళలు, చదువులు, ఉపాధిలో రాణిస్తున్న వారి ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు తీసుకుంటున్నారు. అలాగే 'నాకు నచ్చిన సినిమా పాటలు' అనే కార్యక్రమంలో నూతనంగా రిలీజ్ అయిన సినిమా పాటలను ప్రసారం చేస్తూ యువతను ఆకట్టుకుంటోంది. – యువ వాణి

దిగుబడులను పెంచుకోవచ్చు



రేడియోలో వ్యవసాయానికి సంబంధించిన ప్రోగ్రాములు చాలా ఎక్కువగా వేస్తుంటారు. ముఖ్యంగా సాగు చేసే సమయంలో చీడపీడల నివారణపై ఏ మందులు, ఎరువులు వాడాలో అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తుంటారు. అదేవిధంగా నూతన సాగు పద్ధతుల గురించి తెలియజేయడం వలన కొత్త పంటలను సైతం పండించడానికి వీలు కలుగుతుంది.
– చిల్కూరి స్వామి రెడ్డి, తాంసి, రైతు

స్థానిక సంస్కృతిపై అవగాహన



100.2 ఎఫ్‌ఎం తరచూ వింటూ ఉంటాను. సినిమా పాటలతో పాటు ఎంతో విభిన్నమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తుంటారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలతో పాటు కళలు, జాతరల గురించి నేటి తరానికి తెలియజేస్తుండడం అభినందనీయం. నిత్యం సెల్ ఫోన్లలో ఉండే యువతకు 100.2 ఎఫ్‌ఎం ద్వారా స్థానిక సంస్కృతి సంప్రదాయాలపైన అవగాహన పెరుగుతుంది.
– జాదవ్ అర్జున్ కుమార్, భుక్తాపూర్ ఆదిలాబాద్

నాణ్యమైన ప్రసారాలు అందిస్తాం...



ప్రస్తుతం స్థానికతకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఇక్కడి వైశిష్ట్యమైన గిరిజన, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని కాపాడేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన ఎఫ్‌ఎం ప్రసారాలు వినిపించేలా టవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. టవర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసారాలు అందుబాటులోకి వస్తాయి.
– రామేశ్వర్ కేంద్రే, ఆదిలాబాద్ ఆకాశవాణి ముఖ్య కార్యక్రమ నిర్వహణ అధికారి

మద్యం బాటిల్‌లో స్పిరిట్


నిర్వాహకులతో వినియోగదారుడి వాగ్వాదం

ఆదిలాబాద్: పట్టణంలోని వైన్స్ షాపులో స్పిరిట్ కలిపిన మద్యం బాటిల్ విక్రయించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ బస్టాండ్ వెళ్లేదారిలో వైన్స్ షాపులో వినియోగదారుడు మద్యం బాటిల్ కొనుగోలు చేశాడు. బాటిల్ ఓపెన్ చేస్తే అందులో స్పిరిట్ కలిపినట్లు గుర్తించిన సదరు వ్యక్తి, షాపు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం వారు వేరే బాటిల్ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అయితే జిల్లాలోని పలు వైన్స్ షాపుల్లో మద్యంలో స్పిరిట్ కలిపి అమ్ముతున్నారనే అభిప్రాయాలు వినియోగదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

గుడి గంటలు చోరీ

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో, ధర్మోర, పంచగుడి గ్రామాల్లో గ్రామదేవతల గుడి గంటలు శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీచేశారు. పోలీస్‌స్టేషన్‌లో గ్రామాల వీడీసీ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. చోరీకి పాల్పడ్డ వారిని త్వరగా పట్టుకుంటామన్నారు.

బైక్‌ను ఢీకొన్న పొక్లెయిన్

తాంసి: భీంపూర్ మండలం బుర్కపల్లి శివారులో బైక్‌ను పొక్లెయిన్ వాహనం వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి తప్పించుకోగా, బైక్ పూర్తిగా దెబ్బతింది. వివరాల్లోకి వెళ్లే.. మండలంలోని బెల్సరీ రాంపూర్‌కు చెందిన గంగారాం బైక్‌పై బుర్కపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బుర్కపల్లి రోడ్డుపై మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్ వాహనం వెనక వైపు వస్తూ బైక్‌ను ఢీకొని పైకి ఎక్కడంతో పూర్తిగా దెబ్బతింది. పిప్పల్‌కోటి రిజర్వాయర్ పనులు కోసం మట్టిని తరలిస్తున్న లారీలతోపాటు పొక్లెయిన్ వాహనాలను ఇష్టానుసారంగా నడపడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా


రోడ్డు పక్కన బోల్తా పడిన లారీ

తాంసి: మండలం పొన్నారి సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

అడెల్లిలో భక్తుల సందడి


ఆలయం ఎదుట బారులు తీరిన భక్తులు


ఆలయానికి తరలివస్తున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ తదితర ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరడిగొండ: మండలంలోని వడూర్ జెడ్పీసెకండరీ పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయంగా సాగింది. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత తిరిగి ఒకచోట చేరారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుని పరస్పరం ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ


కాంస్య పతకం సాధించిన దత్తు

ఆదిలాబాద్: జిల్లా తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి సపావత్ దత్తు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. బిహార్ రాజధాని పాట్నాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగిన 18వ జాతీయ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటాడు. హెక్సాథ్లాన్ పోటీల్లో 4,320 పాయింట్లతో నిలిచి కాంస్య పతకం సాధించాడు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, అథ్లెటిక్స్ కోచ్ రవీందర్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

గిరిజనులకు వైద్యసేవలు

- ఉట్నూర్ కేంద్రంగా డయాగ్నోస్టిక్ హబ్
- 57 రకాల రక్త పరీక్షలు
- సబ్ డివిజన్ పీహెచ్‌సీల అనుసంధానం

ఉట్నూర్: గిరిజనుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టింది. అనారోగ్య లక్షణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకోగా, త్వరలో డయాగ్నోస్టిక్ సేవలు గిరిజనులకు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా..

ఏజెన్సీ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రూ.97 లక్షల నిధులతో ఉట్నూర్ సీహెచ్‌సీ ఆవరణలో డయాగ్నోస్టిక్ కేంద్ర భవనాన్ని నిర్మిస్తోంది. ఈ భవన నిర్మాణం పూర్తి కాగానే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్ర భవన నిర్మాణం పూర్తికాగానే కేంద్రంలో వైద్యాధికారితోపాటు ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, మైక్రో బయాలజిస్టుతోపాటు ఇతర సిబ్బందిని ఐటీడీఏ నియమించనుంది.

57 రకాల రక్తపరీక్షలు..
8 పీహెచ్‌సీల అనుసంధానం

టీ హబ్ ఏర్పాటు కాగానే ఏజెన్సీ ఉప డివిజన్‌లోని శ్యాంపూర్, హస్నాపూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, నార్నూర్, గాదిగూడ, ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డయాగ్నోస్టిక్ కేంద్రానికి అనుసంధానం చేయనున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోకి వచ్చే గిరిజనులకు 57 రకాల రక్తపరీక్షలు నిర్వహించి 24 గంటల్లో ఫలితాలు వెల్లడించనున్నారు. అనుసంధానమయ్యే పీహెచ్‌సీల నుంచి గిరిజనుల రక్తనమునాలు సేకరించి డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపించి 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అనారోగ్య లక్షణాలు నిర్ధారించి తగిన వైద్యసేవలు అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ప్రతిరోజు సేకరించిన రక్త నమునాలను తరలించనున్నారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా ఫలితాలను ఆయా పీహెచ్‌సీలకు పంపించనున్నారు. ఈ డయాగ్నోస్టిక్ కేంద్రం ద్వారా సత్ఫలితాలు వస్తే మిగతా ఏజెన్సీ పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తామని వైద్యాధికారులు అంటున్నారు.


నిర్మాణదశలో ఉట్నూర్ డయాగ్నోస్టిక్ హబ్ భవనం

త్వరలో అందుబాటులోకి..

తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకుంది. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్రంలో గిరిజనులకు 57 రకాల రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి లక్షణాలను పూర్తిస్థాయిలో గుర్తించి వైద్యసేవలందించే అవకాశం ఉంది.
– బాలు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి, ఉట్నూర్

'పట్నాపూర్ అభివృద్ధికి కృషి'

బోథ్: మండలంలోని పట్నాపూర్‌లో ఎంపీ సోయం బాపూరావు ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలను తిలకించారు. ఎంపీ మాట్లాడుతూ పట్నాపూర్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. యూత్ కమ్యూనిటీ హాల్‌కు రూ. 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీని గ్రామస్తులు సన్మానించారు.

కాల్వలో పడి రైతు మృతి

మామడ: ప్రమాదవశాత్తు సరస్వతీ కాలువలో పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని చందారం గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. కొరికల్ గ్రామానికి చెందిన మోతె నడిపి రాజన్న (65) ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం చేను వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా చేను పక్కనే గల సరస్వతీ కాల్వలో పడిపోయాడు. చందారం శివారులోని కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని రాజన్న మృతదేహంగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



బతుకుదెరువు కోసం రాజస్థాన్ రాష్ట్రం నుంచి కొందరు తానూరు మండలం హిప్నెల్లి గ్రామానికి అదివలసవచ్చారు. వేసవికాలం సమీపిస్తుండడంతో మేకలు, గొర్రెలు, ఒంటెలను వెంటబెట్టుకుని కుటుంబంతో కలిసి ఇక్కడకు వచ్చారు. వేసవికి ముందుగానే ఇక్కడకు చేరుకుని పొలాల్లో జీవాల మందపెడుతుంటారు. ఇందుకుగాను రైతులు ఒక రోజుకు రెండు అడ్డల బియ్యం రూ.200లు ఇస్తున్నారు. జీవాలకు మేతతోపాటు తమకు ఉపాధి దొరుకుతుందని కాపర్లు తెలిపారు. – తానూరు